క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేస్తున్న కారణంగా వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. స్టేషన్ రోడ్డు, ఆజంజాహి మిల్స్, ఖిలా వరంగల్, ఉర్సు, శంభునిపేట, దేశాయిపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: జయగిరి, మల్లారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిల్లోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ సామ్యనాయక్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఉదయం 10.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈమేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

26 వరకు లా స్పాట్ అడ్మిషన్లు

నయీంనగర్: లా సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆదర్శ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ 3, 5 సంవత్సరాల కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు పొందడానికి ఈనెల 17 నుంచి 26 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల సెక్రటరీ బూర విద్యాసాగర్ గౌడ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ప్రతిభ ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్‌తో వెరిఫై చేయించుకోవాలని పేర్కొన్నారు.

అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల టీషర్ట్స్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 19నుంచి నిర్వహించనున్న అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలకు సంబంధించిన కబడ్డీ జెర్సీ టీషర్ట్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకుడు డాక్టర్ మంథిని శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై నిరసన

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పుకోట రోడ్డుపై సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీని కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీని శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దాంతో నాయకులు నిరసన తెలిపారు. ఫ్లెక్సీని చించివేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ మీటర్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం ఎంఎంనగర్, గిరిప్రసాద్‌నగర్ కాలనీల గుడిసెవాసులకు విద్యుత్ శాఖ మీటర్లను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై విద్యుత్ అధికారులతో కలిసి పేదలకు విద్యుత్ మీటర్లను అందజేశారు. ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోగి సురేష్, ఎస్‌డీ షబ్బీర్, శ్రీను, సింగారపు ఏలియా, రాజు, జగన్, రాజు, రవీందర్, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాయిచందన్‌కు అభినందన



కేయూ క్యాంపస్: కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులోని జలహళ్లి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఈనెల 26 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా వాయ్ సైనిక్ క్యాంపులో కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో బీటెక్ మెకానికల్ మూడో సంవత్సరం చదువుతున్న ఎయిర్‌వింగ్ కేడెట్ బి.సాయిచందన్ పాల్గొని రేడియో కంట్రోలర్ ఆఫ్ ఎయిర్ మోడలింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ క్యాంపులో దేశవ్యాపితంగా 608మంది కేడెట్లు పాల్గొన్నారు. కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో సాయిచందన్‌ను రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ సీహెచ్.రాధిక, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఏరో మోడలింగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, తదితరులు అభినందించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

కాజీపేట: కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగి జై సోమశేఖర్ విధులు పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా సంజయ్‌కుమార్ వేగంగా మరో వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. దాంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంతో 108 సిబ్బంది ఈఎంటీ చైతన్య, పైలట్ అశోక్ కుమార్ ఎంజీఎంకు తరలించారు.

చేపల మార్కెట్ కలేనా?

- ప్రధాన రోడ్లపైనే విక్రయాలు
- గతంలో మార్కెట్‌కు తాత్కాలిక నిర్మాణం చేపట్టి వదిలేసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు



వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తున్న మత్స్యకార్మికులు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో ప్రత్యేకంగా చేపల మార్కెట్ అంటూ లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజాప్రతినిధులు చేపల మార్కెట్ నిర్మాణానికి చొరవ చూపలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఎనిమిదేళ్ల క్రితం అండర్ బ్రిడ్జి వద్ద చేపల మార్కెట్‌కు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టినా బ్రిడ్జి విస్తరణతో షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో చేపల మార్కెట్ వ్యాపారస్తులకు కలగానే మిగిలిపోయింది. నగర రహదారులపై చేపల దుకాణాలు ఉండడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధంగా మారుతున్నాయి. ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి తెచ్చిన చేపలను మత్స్యకారులు రోడ్లపై విక్రయిస్తున్నారు. చేపల నుంచి వచ్చే వ్యర్థాలు సమీపంలోని డ్రెయినేజీల్లో పడవేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అండర్ బ్రిడ్జి వద్ద తాత్కాలిక దుకాణ సముదాయాలు నిర్మించారు. ప్రారంభం కాకుండానే అవి నేలమట్టమయ్యాయి. దీంతో ఎప్పటిలానే వ్యాపారులు రోడ్డుపైనే విక్రయిస్తున్నారు. ఫోర్ట్‌రోడ్డు అండర్ బ్రిడ్జి నుంచి ఆర్టీఏ జంక్షన్ వరకు, కాశిబుగ్గ రోడ్డు నుంచి మార్కెట్ వరకు, పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట, గోపాలస్వామి టెంపుల్ వరకు మత్స్యకారులు రహదారులపైనే విక్రయాలు సాగిస్తున్నారు. దాంతో ముఖ్యంగా ఆదివారం ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తుతోంది.

స్థల కేటాయింపు ఎప్పుడో..?

వరంగల్, ఖిలా వరంగల్ మండల పరిధిలో సుమారు 50కి పైగా చెరువులు ఉన్నాయి. మత్స్యకారులు కొన్ని గ్రామాల్లో చెరువుల్లో చేపలను పెంచుతుంటారు. ఇప్పటికే గ్రామానికి ఒక్కటి చొప్పున మత్స్య సొసైటీలు ఉన్నాయి. పట్టిన చేపలను విక్రయించేందుకు మార్కెట్ అంటూ ఏమీ లేదు. చేపలను రహదారులే మార్కెట్‌గా ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నామని చిరు వ్యాపారులు చెబుతున్నారు.

ప్రభుత్వంపైనే ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మత్స్య కార్మికులు కోటి ఆశలు పెట్టుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని ఆశిస్తున్నారు. ఎన్నికల హామీలను అమలు చేసే దిశగా అడుగులు సర్కారు వేస్తోంది. మత్స్య కార్మికుల అభ్యర్థనను జిల్లా అధికారులు స్వీకరించినట్లు పలువురు చెబుతున్నారు. మార్కెట్‌ను వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లో ఎక్కడైనా అనువైన స్థలాన్ని కేటాయించి నిర్మాణం చేపట్టాలని మత్స్య శాఖను కోరామని మత్స్య సొసైటీ చైర్మన్లు చెబుతున్నారు.

స్థలం కేటాయించాలి



చేపల మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించాలి. గ్రామ చెరువుల్లో తెచ్చిన చేపలు కనీస సౌకర్యాలు లేక దెబ్బతింటున్నాయి. వాటిని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

– బుస్స వెంకన్న, మత్స్య కార్మిక సంఘం అల్లీపురం గ్రామ శాఖ అధ్యక్షుడు

రోడ్ల పక్కనే విక్రయాలు



మత్స్యకార్మికులు రహదారులపై చేపలు పోసి వర్షంలో తడుస్తూ, ఎండకు ఎండుతూ విక్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి చేపల మార్కెట్ ఏర్పాటుకు చర్య తీసుకోవాలి.

– సంగరబోయిన ఉమేష్, మత్స్య సంఘం సభ్యుడు, తూర్పుకోట

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఆర్ట్స్ కళాశాల ఎదురుగా రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా రోడ్డుపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచినా విద్యారంగ సమస్యలు అలాగే ఉన్నాయని విమర్శించారు. దాంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి తాళ్లపెల్లి అరుణ్, జోనల్ ఇన్‌చార్జ్ శ్రవణ్‌కుమార్, బాధ్యులు సర్దార్, సందీప్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖమంత్రిని నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్, అభిషేక్, సందీప్, రాజ్‌కుమార్, ప్రవళిక, శిరీష, మానస, అనూష తదితరులు పాల్గొన్నారు.

కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలనే పెట్టాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలనే నెలకొల్పాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఈనెల 28న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ మాట్లాడుతూ కళాక్షేత్రంలో కళలకు సంబంధం లేని వ్యక్తుల విగ్రహాలు పెట్టొద్దని సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఆడి పాడిన కళాకారులు, తెలంగాణ కళారూపాలను కాపాడిన కళాకారులను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. గద్దర్, చుక్కా సత్తయ్య, మిద్దె రాములు, చిందు ఎల్లమ్మ, గూడ అంజయ్య, బెల్లి లలిత, సాయిచంద్, ఎర్ర ఉపాధి, వరంగల్ శంకరన్న, సారంగపాణి, నేరెళ్ల వేణుమాధవ్ వంటి ఎంతోమంది కళాకారులను గౌరవించాలని పేర్కొన్నారు. కళాకారులను గౌరవించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు జేరిపోతుల వంశీకృష్ణ, నాగారం మణితేజ, తాటికాయల బన్నీ, దాసరి భరత్, నేనావత్ సాయికుమార్, పి.జయంత్, కె.భరత్, మిట్టపల్లి వర్షిత్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో పెచ్చులూడిన భవనం



ఎంజీఎం: ఎంజీఎం ఆంకాలజీ వార్డులో శుక్రవారం భవన పైపెచ్చులు కూలడంతో రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక



హన్మకొండ: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే హనుమకొండ జిల్లా జట్టుకు హనుమకొండ హౌజింగ్ బోర్డులోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని పోలెపాక విరి ఎంపికయ్యారు. నవంబర్ 18 నుంచి 20వ తేదీ వరకు వరంగల్ ఏనుమాములలోని ఇన్ఫాంట్ జేసెస్ హైస్కూల్‌లో 11వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో జిల్లా జట్టుకు పోలెపాక విరి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈమేరకు పోలెపాక విరిని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.మత్యాస్ రెడ్డి, డైరెక్టర్ సునితారెడ్డి, కోచ్ పోలెపాక వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్‌లో కీర్తన ప్రతిభ

వరంగల్: ఏనుమాముల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 18 నుంచి 22వ తేదీ జరుగుతున్న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో వరంగల్ రైల్వే గేట్ పెరకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి కీర్తన ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమేరకు పెరకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కీర్తనను ప్రిన్సిపాల్ జి.ప్రభాకర్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు సన్మానం



వెంకటయ్యను సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ కలెక్టరేట్‌లో శుక్రవారం కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ బక్క దానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, నాయకులు జడల రవి, అనిల్, కుమారస్వామి పాల్గొన్నారు.

'భద్రకాళి'ని సందర్శించిన వెంకటయ్య

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ బక్కి వెంకటయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటయ్యకు అర్చకులు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు అందజేసి మహదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, కురుసం లీలాదేవి, రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, తదితరులు

కేయూ క్యాంపస్: విద్యార్థుల పక్షాన పోరాడుతున్న పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 25న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న పోరాట స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈమేరకు కళాశాల ఆవరణలో సభ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, పీడీఎస్‌యూ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వంశీకుమార్, ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, నాయకులు భరత్, విశ్వ, ఆదిత్య, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల అసోసియేషన్ బాధ్యులు మాదాల సతీష్, నారాయణ జూనియర్ కళాశాల సత్యనారాయణ రెడ్డి, షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్, కనిష్క డిగ్రీ కళాశాల వెంకట్, ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల రాజు, ఎస్ఎస్ కాన్సెప్ట్ స్కూల్ చైర్మన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాలలకు దోచిపెడుతున్న సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

హన్మకొండ: ఎస్సీల వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగల ఉద్యోగ అవకాశాలను మాలలకు సీఎం రేవంత్‌రెడ్డి దోచిపెడుతున్నారని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మందకుమార్ మాదిగ ఆరోపించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు చేసిన పోరాట ఫలితంగా వర్గీకరణకు అనుకూలంగా ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ రోజు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముందుగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేస్తానని ప్రగల్బాలు పలికారని తెలిపారు. మాదిగల పొట్ట కొట్టి మాలల కడుపు నింపాలని చూస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 26న వరంగల్‌లో మాదిగల ధర్మయుద్ధ మహాసభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వేల్పుల సూరన్న కాపు, బొడ్డు దయాకర్ మాదిగ, కొయ్యడ మల్లేష్ మాదిగ, మంద రాజు మాదిగ, బిర్రు మహేందర్, జన్ను దినేష్, చాతల్ల రమేష్, కుమ్మరి రాజయ్య, జిల్లెల మురళి, కల్లెపల్లి ప్రణయ్‌దీప్, కట్ల రాజశేఖర్, ఆకారపు మురళి, చాతల్ల శివ, పుట్ట భిక్షపతి, ముక్కెర ముకేష్, కందికట్ల విజయ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న బస్వరాజు సారయ్య, రాజయ్య, తదితరులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా షహీద్ దర్గా ప్రాంగణంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండీ.జమీల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు జరిగాయి. అబ్దుల్లా షహీద్ దర్గా ముతావలి సయ్యద్ ఖాదర్ అలీ నేతృత్వంలో సయ్యద్ జానుల్లా షహీద్ ఈద్గా కబ్రస్థాన్ కేర్ టేకర్ ఎంఏకే తన్వీర్ సహకారంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఉర్సు దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, హసీబ్‌పాషా ఖాద్రీ హాజరై ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు ఊరేగింపు నిర్వహించి జెండాను దర్గా ఎదుట ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నూరొద్దీన్, సయ్యద్ బషీర్, యాకూబ్ అలీ, నసీర్ ఉల్లాబేగ్, ఖహీం, గౌస్, సయ్యద్ ఆరీపొద్దీన్, సర్వర్ బేగ్, మూసిద్‌ఖాన్, ఖలీయర్, మన్సూర్‌అలీ, ఖలీల్, మొసిన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్నేహభావం పెంపొందించుకోవాలి



సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేష్, అతిథులు, తదితరులు

కేయూ క్యాంపస్: జూనియర్, సీనియర్ విద్యార్థులు తమ మధ్య స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ సూచించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఆడిటోరియంలో బీఏ విభాగం జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు శుక్రవారం ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుల్లా రమేష్ హాజరై మాట్లాడారు. విద్యార్థుల మధ్య స్నేహబంధాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థుల మధ్య వైరుధ్యాలు ఉండకూడదని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భిక్షపతి, ఆర్.ఆదిరెడ్డి, శ్రీధర్‌కుమార్, చారి, సుచరిత, మాధవి, శేషు, సంజీవ్, చందులాల్, జాస్మిన్, సదాశివ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గాలికుంటు వ్యాధి ప్రమాదకరం



హసన్‌పర్తి: పశువుల్లో గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరమని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎండి.అజీమ్ పాషా తెలిపారు. హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో పశువులకు శుక్రవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా పశువులకు రెండుసార్లు గాలికుంటు నివారణ టీకాలు వేయాలని సూచించారు. కలుషిత నీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధి సోకుతోందని చెప్పారు. ఈ సందర్భంగా 470 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది సయ్యద్ ఇఫ్తెకార్ అలీ, కె.రమేష్, ఎల్లస్వామి, కుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



హసన్‌పర్తి: ఇటీవల గుండెపోటుకు గురై మరణించిన భీమారానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాయకపు సుభాష్, ప్రమాదశాత్తు అగ్ని ప్రమాదానికి గురై మరణించిన పెంబర్తికి చెందిన జోరుక ధరణి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సదయ్య, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు లెనిన్, మధు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాంప్రసాద్, వీసం సురేందర్ రెడ్డి, ఆకుల కుమార్, సాంబయ్య, బుచ్చిరెడ్డి, బూర సారంగపాణి తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురంలోని పెన్షన్ పురానికి చెందిన ఇమ్రాన్ భార్య అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను జనతా గ్యారేజ్ హెల్పింగ్ ప్రెసిడెంట్ సుభాకర్, సభ్యులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్, బోగి, రాజు, సూరి, విజయ్, పండు, సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి

కాజీపేట రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, జీఓ నంబర్ 25ను సవరించాలని కాజీపేట దర్గా హైస్కూల్‌కు చెందిన డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కటుకూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు ధర్మసాగర్ మండలంలో జెడ్పీహెచ్ఎస్ మల్లక్‌పల్లి, యూపీఎస్ ధర్మపురం, జెడ్పీహెచ్ఎస్ పెద్దపెండ్యాల, జెడ్పీహెచ్ఎస్ తాటికాయల, పీఎస్ కరుణాపురం, పీఎస్ పెద్దపెండ్యాల, పీఎస్ హరిజన కాలనీ, రెడ్డిపల్లె పీఎస్ కాశెగూడెం, పీఎస్ రాపాకపల్లి జెడ్పీహెచ్ఎస్, ఉనికిచర్ల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.సుభాషిని, జిల్లా కౌన్సెలర్ డి.మహానంద రెడ్డి, మండల బాధ్యులు సీహెచ్.బాబురావు, రాజేష్, టి.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడుదాం



అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి యాదవ నగర్ కాలనీలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పిలుపు మేరకు అవినీతికి వ్యతిరేకంగా శుక్రవారం అవగాహన కల్పించారు. అవినీతిని ఎలా అరికట్టాలి, వెబ్‌సైట్ల వినియోగంపై గ్రామస్తులకు సంస్థ జిల్లా మేనేజర్లు మోహన్ కృష్ణ, సునీల్ రవికుమార్ అవగాహన కల్పించారు. అనంతరం అవినీతిని అరికట్టడంలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో అనిల్, జగదీశ్, ఐతరాజు, హరికృష్ణ, కార్తీక్, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రజిత తదితరులు పాల్గొన్నారు.

నాలా ఆక్రమణలపై 'డ్రోన్' సర్వే



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి – మడికొండ గ్రామాల మధ్య ఉన్న పెళ్లి వాగు నాలాపై నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న నాలా పూర్తిగా రియల్ వ్యాపారుల చేతిలో చిక్కి శల్యమైందనే ఫిర్యాదుల మేరకు డ్రోన్ సహాయంతో సర్వే చేశారు. మడికొండ గ్రామం పెద్ద తూము నుంచి పెళ్లి వాగు వంతెన మీదుగా సోమిడి ఎర్ర చెరువు వరకు ఉన్న నాలాను సర్వే చేశారు. నాలా ప్రాంతం అనేక ప్రాంతాల్లో కబ్జాకు గురైనట్లుగా అధికారులు గుర్తించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు నీటిపారుదల శాఖ అధికారులు సమర్పించనున్నట్లు సమాచారం.

రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యనారాయణ హఠాన్మరణం



సత్యనారాయణ (ఫైల్)

వరంగల్ స్పోర్ట్స్ / కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వడ్డెపల్లి సత్యనారాయణ (62) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. హనుమకొండ వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన సత్యనారాయణ.. సిద్దిపేటలో జరుగుతున్న కబడ్డీ క్రీడాపోటీలకు అతిథిగా వెళ్లారు. అక్కడి క్రీడాకారులతో సరదాగా మాట్లాడుతున్న సమయంలో గుండెపోటుకు గురికాగా, ఆస్పత్రికి తీసుకెళ్లే సరికే మృతిచెందినట్లు అతడి సన్నిహితులు తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహానికి మృతదేహాన్ని శనివారం తీసుకొచ్చి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన సత్యనారాయణ గతంలో కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు.